క్లుప్తంగా

నూకాలమ్మ జాతర ప్రారంభం



ప్రత్యేక అలంకారంలో నూకాలమ్మ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నూకాలమ్మ అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. చిట్టినగర్ సొరంగం రోడ్డులోని నూకాలమ్మ ఆలయంలో మంగళవారం నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు జాతర నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా అమ్మవారికి అభిషేకాలు, విశేష అలంకరణ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వాహకులచే కలశస్థాపన చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు నగరంలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

చురుగ్గా ఇండోర్ స్టేడియం పనులు



కేఎల్ రావు పార్కులో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): 46వ డివిజన్‌లోని కేఎల్‌రావు పార్కులో నూతనంగా నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం పనులు వేగం పుంజుకున్నాయి. కేఎల్‌రావు పార్కు అభివృద్ధికి సుమారు రూ.1.30 కోట్ల అంచనాలను రూపొందించారు. పార్కులో వాకింగ్ ట్రాక్‌తో పాటు షటిల్‌కోర్టు, ఇండోర్ స్టేడియం నిర్మాణానికి అంచనాలను రూపొందించారు. వారం రోజులుగా ఇండోర్ స్టేడియం నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. మేయర్ రాయన భాగ్యలక్ష్మి రెండు పర్యాయాలు పార్కును సందర్శించి అభివృద్ధి పనుల పురోగతి గురించి ఆరా తీశారు. పార్కులో వాకింగ్ ట్రాక్‌తో పాటు ఇండోర్ స్టేడియం నిర్మాణం త్వరితగతిన పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు.

నేడు పన్నులు చెల్లించవచ్చు

పటమట(విజయవాడతూర్పు): ఉగాది సందర్భంగా బుధవారం సెలవు ఉన్నప్పటికీ విజయవాడ నగరపాలక సంస్థ మూడు సర్కిళ్ల పరిధిలోని ఆయా క్యాష్ కౌంటర్లల్లో వీఎంసీకి చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయిలు కట్టించుకుంటామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గర్భిణులకు బాలామృతం, గుడ్లు పంపిణీ చేస్తున్న గోదావరి గంగ

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ 47వ డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారాన్ని స్థానిక కార్పొరేటర్ గోదావరి గంగ మంగళవారం పంపిణీ చేశారు. పోషకాలు కలిగిన ఏడు వస్తువులతోకూడిన బాలామృతం ప్యాకెట్లు, కోడి గుడ్లను అందజేశారు. అనంతరం స్థానిక పుచ్చలపల్లి లీలావతి మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో చిన్నారులకు రాగి జావ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకుడు గోదావరి బాబు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న బాలుడి మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు కొత్తపేట శ్రీనివాసమహల్ కొండ ప్రాంతానికి చెందిన సింగవరపు నూకరత్నంకు ఇద్దరు కుమారులు. భర్త ఉదయ్‌భాస్కర్ 2016లో అనారోగ్యంతో మృతి చెందాడు. పెద్ద కుమారుడు సాయి దుర్గారావు ఎలక్ట్రికల్ షాపులో పనిచేస్తుండగా, చిన్న కుమారుడు (12) కవికుమార్ స్కూల్లో ఆరో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 14వ తేదీ నుంచి రెండు రోజులుగా చిన్న కుమారుడు స్కూల్‌కు వెళ్లడం లేదని తెలిసి తల్లి నూకరత్నం మందలించింది. కడుపులో నొప్పిగా ఉందని చెప్పిన బాలుడు తల్లి, అన్నయ్య పనికి వెళ్లిన తర్వాత ఇంట్లో ఉరి వేసుకునానడు. ఇంటి పక్కనవాళ్లు గమనించి ఉరి నుంచి కిందకు దింపి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న బాలుడు మంగళవారం రాత్రి మృతి చెందాడు. బాలుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పూలమార్కెట్‌కు పండగ కళ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఉగాది పురస్కరించుకుని వన్‌టౌన్‌లోని హోల్‌సేల్ పూల మార్కెట్ వినియోగదారులతో మంగళవారం కిటకిటలాడింది. ఉగాది పూజలకు పూలు తీసుకెళ్లేందుకు నగరవాసులు భారీగా మార్కెట్‌కు తరలివచ్చారు. దీంతో వీఎంసీ కార్యాలయం సమీపంలోని హోల్‌సేల్ పూల మార్కెట్ రద్దీగా దర్శనమిచ్చింది.

రెట్టింపైన పూల ధరలు

పూల ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. మొన్నటి వరకూ కనకంబరాలు కిలో నాలుగు వందలు పలకగా మంగళవారం ఉదయం వెయ్యి వరకు ధర పలికింది. మల్లెపూలు మొన్నటి వరకూ కిలో రూ.400 మాత్రమే ఉండగా మంగళవారం రూ.700 దాటింది. వాటితో పాటుగా చామంతి, గులాబీ ధరలు రూ.300 వరకూ పలుకుతున్నాయి. లిల్లీ మొన్నటి వరకూ రూ. 100 పలకగా మంగళవారం రెండు వందలు వినిపించింది. రిటైల్‌గా ఇళ్ల వద్ద ఆ ధరలు మరింత పెరిగి వినియోగదారులకు మరింత భారమయ్యాయి.

పూలదండలకు భలే గిరాకీ



వన్‌టౌన్‌లో కొనుగోలుదారులతో కళకళలాడుతున్న పూల మార్కెట్

మార్కెట్‌లో పూలదండలకు గిరాకీ పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రధానంగా ఆలయాలు, ఇళ్లలో దేవుని విగ్రహాలతో పాటుగా అలంకరణకు దండలు వినియోగిస్తారు. దస్త్రాలు ఉన్న దుకాణాదారులు సైతం భారీగా పూలదండలను తీసుకెళ్లారు. పండుగ సందర్భంగా వివిధ సభా కార్యక్రమాలను నిర్వహించే సంస్థలు దండలకు ఆర్డర్లిచ్చినట్లు వ్యాపారులు చెబుతున్నారు. వీటి ధరలు రెండు వందల నుంచి వెయ్యి వరకూ పలుకుతున్నాయి.

విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు



రాగిజావను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ మండేపూడి చటర్జీ



రాగిజావను పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు



పంపిణీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్



విద్యార్థులకు రాగి జావ అందజేస్తున్న విజయ్‌కుమార్



జీఎస్‌ఆర్ హైస్కూల్లో రాగి జావ పంపిణీ చేస్తున్న రత్నకుమారి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ అన్నారు. కొత్తపేట 51వ డివిజన్ పరిధిలోని తెలప్రోలు రాజాహైస్కూల్, అన్నపూర్ణాదేవి నగరపాలక సంస్థ హైస్కూల్ తదితర విద్యాసంస్థల్లో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మరుపిళ్ల రాజేష్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో అన్నపూర్ణాదేవి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, రాజాహైస్కూల్ ప్రధానోపాధ్యాయులు హనుమంతరావు, పాత శివాలయం పాలకమండలి మాజీ సభ్యుడు పణుకు ఫణీంద్ర, నాయకులు ఆనంద్, జానకీమల్లేశ్వరరావు, ఆలకు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

హిందూహైస్కూల్‌లో..

కొత్తపేట హిందూహైస్కూల్‌లో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు చిట్టా రాజశేఖర్, డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, ఆనందకుమార్, పురుషోత్తం, వ్యాయామ ఉపాధ్యాయులు ఎంవీ సత్యప్రసాద్, ఎన్‌సీసీ అధికారి బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

37వ డివిజన్‌లో..

37వ డివిజన్‌లోని పాదర్తి సుందరమ్మ నగరపాలక సంస్థ హైస్కూల్ ప్రాంగణంలో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు జిలానీ, గ్రంధి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోషకాహారం అందించడమే లక్ష్యం

వించిపేట(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాగి జావను అందించడం వలన వారిలో శారీరక, మానసిక ఆరోగ్యంతో ఉన్నత లక్ష్యాలను చేరుకోగలరని 49వ డివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్ పేర్కొన్నారు. చిట్టినగర్‌లోని మట్టా లాజరస్ నగరపాలక సంస్థ పాఠశాలలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నప్పుడే చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 49వ డివిజన్ అధ్యక్షుడు గౌడుపేరు సుధీర్, నాయకులు జయప్రకాష్ కేనడి, శ్రీనివాసరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

మరో పోషకాహారం రాగి జావ

భవానీపురం(విజయవాడపశ్చిమ): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న గోరుముద్ద ద్వారా మరో పోషకాహారం రాగి జావ అందిస్తున్నారని 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని గొల్లపల్లి నాగేశ్వరరావు మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్, లేబర్‌కాలనీలోని జీఎస్‌ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు రాగి జావను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు వీవీ రవికుమార్, ప్రసన్నకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావు పాల్గొన్నారు.

కనుమర్లపూడి సుబ్బారావు ఎలిమెంటరీ స్కూలో..

స్థానిక బ్యాంక్ సెంటర్‌లోని కనుమర్లపూడి సుబ్బారావు మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్లో వీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, 40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి విద్యార్థులకు రాగి జావ అందజేశారు. కార్యక్రమంలో 41వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్, డివిజన్ బీసీ సెల్ అధ్యక్షుడు రమణయ్య, పాఠశాల హెచ్‌ఎం ఉషారాణి పాల్గొన్నారు.

చర్చి, మసీదులకు రూ.2.27 లక్షల సాయం



విరాళం అందిస్తున్న వెలంపల్లి కుమార్తె సాయి అశ్విత

విరాళం అందించిన వెలంపల్లి ఫౌండేషన్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని చర్చి మసీదులకు సంబంధించి మరమ్మతులకు వెలంపల్లి ఫౌండేషన్ రూ.2.27 లక్షలను మంగళవారం సాయాన్ని అందించింది. పశ్చిమ నియోజకవర్గం 56వ డివిజన్‌లోని జామియా ఫైజాన్ ఫాతిమా లేడీస్ మదర్సాకు రూ.లక్ష, 46వ డివిజన్‌లోని రక్షణ సైన్యం మందిరానికి రూ.లక్ష, 54వ డివిజన్ వించిపేట షాహి మసీదుకు రూ.27 వేల విలువ గల ఒక లైటును అందించారు. మంగళవారం వెలంపల్లి శ్రీనివాసరావు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వెలంపల్లి ఫౌండేషన్ చైర్మన్ సాయిఅశ్విత ఆయా పెద్దలకు సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన తండ్రి శ్రీనివాసరావు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయా ప్రాంతాల్లో పర్యటించిన సమయంలో వారు అడిగిన సాయానికి స్పందించి వీటిని అందజేశామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వెలంపల్లి రాఘవనర్సింహరావు, కొనకళ్ల విద్యాధరరావు, కార్పొరేటర్ అబ్దుల్ అర్షద్, దుర్గగుడి ధర్మకర్త బుద్దా రాంబాబు, నాయకులు రాయన నరేంద్ర, మొహమ్మద్, ఖాదర్, వాజిద్‌ఖాన్ పాల్గొన్నారు.

నూతన ఏడాది విద్యార్థులకు మేలు చేయాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నూతన ఏడాది విద్యార్థులందరికీ మేలు చేయాలని ఎస్‌కేపీవీవీ హిందూహైస్కూల్స్ కమిటీ అధ్యక్షుడు చిట్టూరి ఆనందసుధాకర్ అన్నారు. హిందూ హైస్కూల్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను మంగళవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కంచర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో భాగంగా తొలుత పలు పురస్కారాలను అందుకున్న బాలసరస్వతి, ప్రణీతరెడ్డిల కూచిపూడి నృత్యంతో అతిథులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమిటీ కోశాధికారి బాబావిజయకుమార్ చేతుల మీదగా 2022-23 విద్యా సంవత్సరంలో వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉగాది పురస్కారాలు అందించారు.

కనకదుర్గనగర్‌లో దుకాణాలు మూసివేసి నిరసన



దుకాణాలు మూసివేసి నిరసన వ్యక్తం చేస్తున్న యజమానులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కనకదుర్గనగర్‌లో షాపుల వ్యవహారం చిలికి చిలికి గాలివానగా మారుతుంది. దుకాణాల ముందు 10 అడుగుల మేర రోడ్డును ఆక్రమిస్తున్నారంటూ ఈఓ భ్రమరాంబ ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా ఆక్రమణలను హుటాహుటిన తొలగింపునకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో సోమవారం రాత్రి, మంగళవారం ఉదయం దుకాణాల ముందు ఆక్రమణలు తొలగించడంతో వివాదం చోటు చేసుకుంది. భక్తులు నడిచే దారికి 20 అడుగుల దూరంలో దుకాణాలు నిర్మించిన దేవస్థానం, ప్రతి నెలా రూ.లక్ష పైబడి అద్దె చెల్లిస్తున్నామని షాపు యజమానులు పేర్కొంటున్నారు. షాపుల ముందు పూజా సామగ్రి, ఫ్యాన్సీ వస్తువులు, ఆట వస్తువులను ఎవరు కొంటారని వారు ప్రశ్నిస్తున్నారు. ఈఓ భ్రమరాంబ వ్యవహార శైలిని నిరసిస్తూ షాపు యజమానులు మంగళవారం తమ దుకాణాలను మూసివేసి, నిరసన వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఆలయ అధికారుల తీరుకు వ్యతిరేకంగా కనకదుర్గనగర్‌లో నిరసన వ్యక్తం చేశారు. షాపులు కేటాయించే సమయంలో వ్యాపారాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తానని చెప్పిన ఈఓ ఇప్పుడు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటి సాయంత్రం వరకు సొరంగ మార్గం మూసివేత



సొరంగం మార్గం వద్ద చెట్ల తొలగింపు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న దుర్గారావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం వంగవీటి మోహన రంగా జంక్షన్ నుంచి చిట్టినగర్ వైపు వెళ్లే సొరంగ మార్గాన్ని బుధవారం సాయంత్రం వరకు మూసి వేస్తున్నట్లు 44, 45 డివిజన్ల కార్పొరేటర్లు మైలవరపు రత్నకుమారి, మైలవరపు మాధురి లావణ్య తెలిపారు. సొరంగం కొండపైన ప్రమాదకరంగా ఉన్న చెట్లను నగరపాలక సంస్థ సిబ్బంది తొలగిస్తున్న క్రమంలో సొరంగ మార్గం ద్వారా ప్రజల రాకపోకలను నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. సొరంగం కొండపై ఉన్న వృక్షాల కారణంగా అక్కడ ఉండే మట్టి, చెత్తాచెదారం జారి కింద నుంచి ప్రయాణించే ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని, ఈ నేపథ్యంలోని ప్రమాదాలను నివారించేందుకు సొరంగం కొండపై ఉన్న చెట్లను తొలగించి అక్కడ పూర్తి స్థాయిలో శుభ్రం చేసేందుకు నగరపాలక సంస్థ ద్వారా ఈ ప్రక్రియను చేపట్టామని వారు వివరించారు. విద్యాధరపురం, భవానీపురం ప్రజలు సహకరించాలని కోరారు. కాగా కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావు పర్యవేక్షిస్తున్నారు.

ఆర్యవైశ్యుల జోలికొస్తే సహించేది లేదు



పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): టీడీపీ నేతలు ఆర్యవైశ్యుల జోలికొస్తే సహించేది లేదని ఏపీ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు హెచ్చరించారు. అసెంబ్లీలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుపై టీడీపీ ఎమ్మెల్యేల దాడిని నిరసిస్తూ పాతబస్తీలోని సామారంగంచౌక్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాధరరావు మాట్లాడుతూ శాసన సభ వేదికగా వెలంపల్లిపై చేసిన దాడిని ఖండిస్తున్నామన్నారు. వెలంపల్లిపై దాడి అంటే రాష్ట్ర వ్యాప్త ఆర్యవైశ్యుల దాడిగా పరిగణిస్తామన్నారు. ఆర్యవైశ్య సంఘం నగర అధ్యక్షుడు కొండపల్లి బుజ్జి మాట్లాడుతూ వెలంపల్లి జోలికి వస్తే తాటతీస్తామన్నారు. చంద్రబాబు ఆర్యవైశ్యులపై దాడి చేయించడం సబబు కాదన్నారు. మహాసభ గౌరవ అధ్యక్షుడు పెనుగొండ సుబ్బారాయుడు మాట్లాడుతూ ఆర్యవైశ్యులపై దాడి అమానుషమన్నారు. కార్యక్రమాన్ని ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు గుడిపాటి కిషోర్ నిర్వహించగా 37, 39 డివిజన్ల కార్పొరేటర్లు మండేపూడి చటర్జీ, గుడివాడ నరేంద్ర నాయకులు శేగు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డివిజన్‌లో జీఎం అరుణ్‌కుమార్ జైన్ సమీక్ష సమావేశం



సమీక్ష నిర్వహిస్తున్న అరుణ్‌కుమార్ జైన్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ డివిజన్ పనితీరుపై దక్షిణ మధ్య రైల్వే జోన్ జీఎం అరుణ్‌కుమార్‌జైన్ మంగళవారం విజయవాడ డివిజనల్ కార్యాలయంలో డీఆర్ఎం, ఏడీఆర్ఎంలు, పలు విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రాజెక్టుల గురించి డీఆర్ఎం శివేంద్రమోహన్ జీఎంకు వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2022-23లో గూడూరు-విజయవాడ సెక్షన్‌లలో 135.8 కిలోమీటర్లు విద్యుద్దీకరణతో మూడవ లైన్ నిర్మాణ పనులతో పాటు బ్రాంచ్ లైన్ డబ్లింగ్ పనులు పూర్తిచేయడంలో కృషిచేసిన విజయవాడ డివిజన్ అధికారులను జీఎం అభినందించారు. రోజువారీ విధుల్లో ఎదురవుతున్న సమస్యలు, హెడ్‌క్వార్టర్స్ నుంచి అందించాల్సిన విషయాలపై బ్రాంచ్ అధికారులతో మాట్లాడారు. హెడ్‌క్వార్టర్స్ నుంచి డివిజన్‌కు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా జీఎం హామీ ఇచ్చారు.

వర్షం నీటి ముంపునకు శాశ్వత పరిష్కారం

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్



పాత ఆర్‌ఆర్‌పేటలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, కలెక్టర్ ఢిల్లీ రావు, కమిషనర్, సబ్ కలెక్టర్

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలోని నైజాంగేట్ పరిసర ప్రాంతాలు వర్షపు నీటి ముంపునకు గురి కాకుండా చర్యలు చేపడుతున్నట్లు మాజీ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ ఆదితి సింగ్‌తో కలిసి 55, 56 డివిజన్ల పరిధిలోని వించి పేట, నైజాంగేట్, కంసాలీపేట, ఆర్‌ఆర్ పేట ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో నెలకున్న డ్రెయినేజీ సమస్యలకు శాశ్వత పరిష్కరాన్ని కృషి చేస్తామన్నారు. దశాబ్దాలుగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నత స్థాయి అధికారులతో కలిసి ఈ పర్యటన చేపట్టినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఎర్రకట్ట బ్రిడ్జిని మరో మూడు నెలల్లో ఆధునీకీకరిస్తామన్నారు. అనంతరం ఆయా ప్రాంతాల్లోని ప్రధాన డ్రెయిన్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో రైల్వే శాఖ, ఆర్‌అండ్‌బీ అధికారులు, నగర పాలక సంస్థ అధికారులు, 55, 56 డివిజన్ల కార్పొరేటర్లు పూర్ణచంద్రరావు, యలకల చలపతి రావు పాల్గొన్నారు.

మొబైల్ కోర్టులో పలువురికి జరిమానా



నిబంధనలు ఉల్లంఘించిన వారిని విచారిస్తున్న జడ్జి రామ్మోహనరావు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర వీధులలో ప్రజలకు అవాంతరం కలిగించే వారికి మున్సిపల్ కోర్టు న్యాయమూర్తి రామ్మోహనరావు జరిమానా విధించారు. మంగళవారం ఆయన సర్కిల్-1 పరిధిలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్ 25 మందిపై కేసులు నమోదు చేయగా వారిని విచారించారు. అందులో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వారిని, పశువులను రోడ్ల పైకి వదిలే వారిని, రోడ్లపై చెత్త వేసే వారిని విచారించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం వారందరికీ జరిమానా విధించి హెచ్చరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి రామ్మోహన్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలను అమలు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది, ప్లాస్టిక్ రహిత నగరంగా మార్చేందుకు శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రెటరీలు, కూడా నిత్యం ఆయా డివిజన్లలో ప్లాస్టిక్ విక్రయ షాపులను తనిఖీ చేసి విధిగా ప్లాస్టిక్ బ్యాన్ అమలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ సురేష్‌బాబు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రెటరీలు పాల్గొన్నారు.

కృష్ణపట్నం పోర్టు పనితీరుపై పీసీసీఎం జాన్‌ప్రసాద్ సమీక్ష



వెంకటాచలంరోడ్ జంక్షన్‌లో ఎలక్ట్రానిక్ ఇన్ మోషన్ వెయిట్ బ్రిడ్జిని ప్రారంభించిన పీసీసీఎం జాన్‌ప్రసాద్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లోని అదాని కృష్ణపట్నం పోర్టు పనితీరుపై ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ (పీసీసీఎం) మేనేజర్ జాన్‌ప్రసాద్ మంగళవారం సమీక్షించారు. ముందుగా వెంకటాచలంరోడ్ జంక్షన్‌లో నూతనంగా నిర్మించిన ఎలక్ట్రానిక్ ఇన్ మోషన్ వెయిట్ బ్రిడ్జిని ఆయన ప్రారంభించారు. అనంతరం అదాని కృష్ణపట్నం పోర్టు ప్రైవేట్ సైడింగ్ లిమిటెడ్‌ని సందర్శించి సీఈఓ జీజే రావుతో సమావేశమయ్యారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో అత్యధిక స్థాయిలో బొగ్గు లోడింగ్ సాధించడంలో మేనేజ్‌మెంట్ అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పరితీరుపై సమీక్షించారు. ప్రస్తుత, రానున్న ఆర్థిక సంవత్సరంలో లోడింగ్ అంచనాలు, సరుకు రవాణా ఆదాయ అంచనాలు, సరుకు రవాణాలో కొత్త మార్గాలు మెరుగుపర్చుకోవడానికి రైల్వేశాఖ, పోర్టు అధికారులు ఇదే పనితీరును కొనసాగించాల్సిందిగా సూచించారు. ప్రస్తుత డిమాండ్, లోడింగ్ లక్ష్యాలను చేరుకోవడానికి రైల్వేశాఖ నుంచి పూర్తి మద్దతు, సహకారం అందిస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ డీఏఎం డి.నరేంద్రవర్మ, డీసీఎం జి.సోమశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

కమ్మని దక్షిణాది రుచుల ఫెస్టివల్



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉగాది సంబరాల పేరుతో ఎంజీ రోడ్డులోని హోటల్ ఫార్చ్యూన్ మురళీపార్క్‌లో కమ్మని దక్షిణాది రుచుల ఫుడ్ ఫెస్టివల్ మంగళవారం ప్రారంభమైంది. హోటల్‌లోని జుడియాక్ రెస్టారెంట్‌లో ఏర్పాటు చేసిన ఫెస్టివల్‌లోని వంటకాలు నోరూరిస్తున్నాయి. ఉగాదిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ ఫెస్టివల్‌లో ఆంధ్రా రీజియన్, రాయలసీమ, కోనసీమ, తెలంగాణాలో ప్రసిద్ధి చెందిన వంటకాలను అందుబాటులో ఉంచారు. నగర వాసులు కోసం విభిన్న రుచులతో ఫెస్టివల్‌ను ఏర్పాటు చేసినట్లు హోటల్ జీఎం ఎంవీఎస్ విజయ్‌కృష్ణ తెలిపారు.

వృక్ష సంపదను కాపాడుకోవాలి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): వృక్ష సంపదను కాపాడుకోవాలని అటవీ శాఖ డెప్యూటీ కన్జర్వేటర్ వి.కృష్ణమూర్తి చెప్పారు. సిద్ధార్థ కళాశాల ఎకో క్లబ్, గ్రీన్ క్లబ్, కళాశాలలోని వాటర్ కన్జర్వేషన్ క్లబ్ సంయుక్తంగా ప్రపంచ అటవీ దినోత్సవాన్ని మంగళవారం కళాశాల ఆవరణలోని సెమినార్ హాల్లో నిర్వహించారు. కృష్ణమూర్తి విద్యార్థులకు అటవీ సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. మానవ అవసరాల కోసం వృక్ష సంపదను విచక్షణా రహితంగా తొలగించడంతో క్రమేపీ అటవీ విస్తర్ణం తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి అటవీ సంపదపై కళాశాల యాజమాన్యం విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రిన్సిపాల్ రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ ప్రొఫెసర్ రాజేష్ సీ.జంపాల, వృక్ష శాస్త్ర విభాగాధిపతి పి.శ్రీనివాసరావు, అధ్యాపకులు డి.శ్రావణి, వి.విశాలాక్షి, నాగార్జునతో పాటుగా విద్యార్థులు పాల్గొన్నారు.